ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

బుధవారం 6 మార్చి 2024



అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణానికి మోక్షమెప్పుడో? 8లో..

బెల్ట్‌షాపులను వెంటనే మూసివేయించాలి - కలెక్టర్ 8లో..




# పంటలు ఎండిపోకుండా చర్యలు

మంథని ప్రాంతంలో ఎస్సారెస్పీ నీటి సరఫరాను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ (ఫైల్)

- నీటిని పొదుపుగా వాడుకునేందుకు అధికారుల జాగ్రత్తలు
- డి-83 ద్వారా మంథని ప్రాంతానికి మూడు రోజులు అదనంగా సరఫరా
- ఎస్సారెస్పీ నుంచి మరో మూడు, నాలుగు తడుల నీళ్లు



డి-83 కాలువ ద్వారా సరఫరా అవుతున్న ఎస్సారెస్పీ సాగునీరు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోకుండా ఉండేందుకు నీటి పారుదల శాఖాధికారులు చర్యలు చేపట్టారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వల ఆధారంగా సాగు నీటిని పొదుపుగా వాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 26.984 టీఎంసీలు, శ్రీపాద ఎల్లంపల్లిలో 8.564 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఈ నీటిని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎక్కడా అవాంతరాలు ఏర్పడకుండా ఉండేందుకు నీటి పారుదల శాఖాధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌కు తాగునీటికి, మిషన్ భగీరథ పథకం ద్వారా రామగుండం, పెద్దపల్లి, మంథని, ధర్మపురి, మంచిర్యాల నియోజకవర్గాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే మంచిర్యాల జిల్లా పరిధిలోని లక్షెట్టిపేట ప్రాంతంలోని 30 వేల ఎకరాలకు గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని అందిస్తున్నారు. మంథని ప్రాంతంలో 20 వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉండగా, నీటి కొరత వల్ల మొదటి విడత నీటిని విడుదల చేసిన అధికారులు ప్రస్తుతం నీటిని ఇవ్వడంలేదు. ఎల్లంపల్లి నుంచి గుండారం రిజర్వాయర్‌కు తరలించి సాగు నీటిని అందిస్తారు. కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని ప్రాంతాల్లోని ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ఆయకట్టు కలిపి మొత్తం 45,095 ఎకరాల భూములకు సాగునీటిని ఎస్సారెస్పీ ద్వారా ఇస్తున్నారు. ఎస్సారెస్పీ నీటిని వారబందీ ద్వారా విడుదల చేస్తున్నారు. మంథని, రామగుండం ప్రాంతానికి డి-83 ద్వారా, పెద్దపల్లి ప్రాంతానికి డి-86 కాలువ ద్వారా సాగు నీటిని అందిస్తున్నారు.

**● కలెక్టర్ పరిశీలన..**

**జిల్లాలో** ఈ యాసంగి సీజన్‌లో 1,88,949 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా ఎస్సారెస్పీ కింద లక్షా 62 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. డి-86 ద్వారా పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని 79,360 ఎకరాలకు సాగు నీరందిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ ప్రాంతంలోని కొన్ని గ్రామాలకు కొంత మేరకు నీళ్లు అందడం లేదు. ముత్తారం మండలంలోని కాలువ చివరి భూములకు నీరందకపోవడంతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డి-83 కాలువకు మూడు, నాలుగు రోజుల పాటు అదనంగా నీటిని విడుదల చేయాలని ఆదేశించడంతో డి-86 కాలువకు నీటిని బంద్ చేసి వచ్చిన నీటిని ఒకటే కాలువకు సరఫరా చేస్తున్నారు. డి-86 కాలువకు నీటిని నిలిపివేయడంపై పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డి-83కి మూడు రోజులు నీళ్లు ఇవ్వడంలో జాప్యం జరిగిందని సర్ది చెప్పారని సమాచారం. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంథని ప్రాంతానికి సాగు నీటిని అందించే విషయమై స్వయంగా పరిశీలిస్తున్నారు. గుండారం రిజర్వాయర్‌తో పాటు ఆ పరిసరాల్లోని చెరువులను పూర్తిగా నింపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో సాగవుతున్న పంటలకు ఢోకా ఉండదని ఈ విషయమై రైతులు ఆందోళన చెందవద్దని నీటి పారుదల శాఖాధికారులు చెబుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి మార్చి నెలాఖరు వరకు ఇంకా రెండు తడులు, ఏప్రిల్ నెలలో పరిస్థితిని బట్టి ఒకటి, రెండు తడుల నీటిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 26.984 టీఎంసీల నీళ్లు ఉండగా, ఒక్కో తడికి 3.5 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. మూడు తడులకు నీళ్లు ఇచ్చినా 10.5 టీఎంసీలు, నాలుగు తడులైతే 14 టీఎంసీల నీళ్లు సరిపోతాయని అధికారులు అంటున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి నీటిని కేవలం తాగు నీటి అవసరాలకే వినియోగిస్తున్నారు. సాగు నీటి విషయమై రైతులు ఆందోళన చెందవద్దని అధికార పార్టీకి చెందిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ చెబుతున్నారు.

## అర్హులందరికీ గ్యారెంటీ పథకాలు అందేలా చర్యలు

**- విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ ఆదేశించారు. మంగళవారం ఆయన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ హెడ్, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు, ప్రజాపాలన సాఫ్ట్‌వేర్ ద్వారా లబ్ధిదారుల వివరాల నమోదు, అర్హులకు గ్యారెంటీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీ పథకాలు అమలుచేసేందుకు ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపాలిటీలలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన కార్యక్రమం కింద క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ నంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వం 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలుచేస్తుందన్నారు. ప్రజా పాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేసుకోని దరఖాస్తుదారులు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సమర్పించాలన్నారు. ప్రజలు తమ తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ నంబర్ వివరాలను తీసుకుని వచ్చి ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలలో తమ అర్హతను పరిశీలించి వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో కె నరేందర్, డీపీవో ఆర్ఎస్పీ లత, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఈడీఎం కవిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి**




మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

కోల్‌సిటీటౌన్, మార్చి 5: కేంద్ర ప్రభుత్వం మహిళ హక్కులను కాలరాస్తూ వారి శ్రమకు తగ్గ గుర్తింపును ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. అంతర్జాయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలోని ఐద్వా కార్యాలయంలో మహిళా దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన అరుణజ్యోతి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 10 సంవత్సరాల కాలంలో మహిళలు, చిన్నారులపై దాడులు, అత్యాచారాలు బాగా పెరిగాయన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ఎనిమిది గంటల పనివిధానం కోసం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మహిళలకు ఓటు హక్కు కల్పించాలని తదితర డిమాండ్ల హక్కుల సాధన కోసం సాగిన ఉద్యమమే మహిళా దినోత్సవం అని గుర్తు చేశారు. నేడు బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే విధంగా మతం పేరుతో మతోన్మాద చర్యలు చేపడుతోందని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంట్ చట్టసభల్లో ఇప్పటివరకు 33శాతం రిజర్వేషన్ ఎందుకు కల్పించలేదనే దానిపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీఐటీయూ మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ జ్యోతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాగర్, ఐద్వా జిల్లా కమిటీ నాయకురాలు షైమద,రమణ, భాగ్య, భావాని, శ్రీను పాల్గొన్నారు.

## త్వరలో రామగుండం సోలార్ విద్యుత్ ప్లాంట్ విస్తరణ

**- తెలంగాణ ఎన్టీపీసీ స్టేజ్-2 నిర్మాణానికి సిద్ధం - పీపీఏ కుదిరితే నిర్మాణ పనులు షురూ**

**- టీఎస్‌టీపీపీ నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణకే.. - ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు**




విలేకరులతో మాట్లాడుతున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్, మార్చి 5 : రామగుండంలో త్వరలో సోలార్ విద్యుత్‌ను విస్తరిస్తామని, కొత్తగా 176 మెగావాట్ల ప్రాజెక్టు నెలకొల్పుతామని రామగుండం ఎన్టీపీసీ, టీఎస్‌టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు తెలిపారు. మంగళవారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈడీ కేదార్ రంజన్ మాట్లాడారు. ఇప్పటికే ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో దేశంలోనే అతి పెద్ద 100 మెగావాట్ల ఫ్లోటింగ్(నీటిలో తేలియాడే) సోలార్ ప్రాజెక్టును నిర్మించామన్నారు. మరో 10 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు గత పదేళ్లుగా నడుస్తున్నదన్నారు. విస్తరణలో భాగంగా ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోనే 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ యూనిట్, సంస్థ పరిధిలోని స్థలంలో 120 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నెలకొల్పుతామన్నారు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడుతామన్నారు.

### తెలంగాణ ఎన్టీపీసీ స్టేజ్-2 నిర్మాణానికి సిద్ధం

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ(స్టేజ్ 2) నిర్మించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) కుదిరిన తరువాత 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) స్టేజ్ 2 నిర్మాణ పనులు చేపడుతామని తెలిపారు. స్టేజ్ 2 విషయంలో సాంకేతిక పరమైన పనులు జరుగుతున్నాయని, పీపీఏ పూర్తయితే నిర్మాణానికి సంబంధించి ముందడుగు పడుతుందన్నారు. టీఎస్‌టీపీపీ స్టేజ్-1లో 800 మెగావాట్ల రెండు యూనిట్లు ప్రారంభమయ్యాయని, కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్(సీవోడీ) ప్రకటించామన్నారు. మొదటి యూనిట్‌ను గత ఏడాది అక్టోబరు 3న, 2వ యూనిట్‌ను గత సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారన్నారు. టీఎస్‌టీపీపీ స్టేజ్-1 పూర్తవడతో ప్రస్తుతం రామగుండం ఎన్టీపీసీ స్థాపిత సామర్థ్యం 4200 మెగావాట్లకు(రామగుండం 2600 మెగావాట్లు, టీఎస్‌టీపీపీ 1600 మెగావాట్లు) చేరిందని, దీంతో దేశంలోనే రెండో అతిపెద్ద ప్రాజెక్టుగా గుర్తింపు వచ్చిందన్నారు. తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుతో రాష్ట్ర విద్యుత్ అవసరాలు గణనీయంగా తీరుతాయని, ఈ ప్రాజెక్టు నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణకే సరఫరా చేస్తామన్నారు. టీఎస్‌టీపీపీని ఆధునిక సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించామన్నారు. కాలుష్య నియంత్రణకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, అలాగే 2600 మెగావాట్ల రామగుం డం ఎన్టీపీసీలో ఎఫ్‌జీడీ నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయన్నారు.

### సామాజిక అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు..

ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ఖర్చుచేస్తున్నామని ఈడీ తెలిపారు. మౌళిక వసతులు, విద్య, ఉపాధి, తదితర రంగాల్లో సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. కాగా, 2600 మెగావాట్ల రామగుండం ఉత్పత్తిని ప్రారంభించి 40 ఏళ్లు దాటిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తోందన్నారు. ప్రాజెక్టుకు ఇటీవల గోల్డెన్ పీకాక్ అవార్డు(2023), ఎక్సలెంట్ ఎనర్జీ యూనిట్‌గా సీఐఐ జాతీయ అవార్డు, బెస్ట్ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ అవార్డులు లభించాయన్నారు. విలేకరుల సమావేశంలో జీఎంలు, ఏజీఎం(హెచ్ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్, డీజీఎం ప్రశాంత్ శ్యామ్యూల్, పీఆర్‌వో రూపాలి రంజన్ పాల్గొన్నారు.

## ఘనంగా ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఓదెల, మార్చి 5 : మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారిని అలంకరించి ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మేకల మల్లేశం అలాగే సభ్యులు కనితిరెడ్డి సతీష్, బత్తుల రమేష్, మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్, డా,దాసరి రాజన్న, గంప కిషోర్, పరుపాటి మహేందర్‌రెడ్డి, రాపర్తి మల్లేశం, మూడెత్తుల శ్రీనివాస్, ఆరెల్లి మొండయ్య, ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమార స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు. కాగా, 8న ఉగాది పర్వదినాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. 9న రథోత్సవంతో పాటు ఎడ్లబండ్ల ప్రదక్షిణలు నిర్వహించి, మొక్కులను సమర్పించనున్నారు. జూలై 14 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగి, అదే రోజున పెద్దపట్నం, మరుసటి రోజు అగ్నిగుండంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**నేడు మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం**

అలాగే బుధవారం క్షేత్ర ప్రాంగణంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.ఉదయం నుంచి బలిహరణ దృష్టి కుంభోత్సవం స్థాపిత మంటపారాధన అగ్ని ప్రతిష్ట రుద్రాహవనం నిర్వహిస్తారు. అలాగే గురువారం నాకబలి బ్రహ్మోత్సవం ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు నిత్య ఉత్సవం, 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నాకబలి రుద్రహవనం హారతి మంత్రపుష్పం గ్రామాల్లో మల్లికార్జునుడి శోభాయాత్ర ఘనంగా నిర్వహించనున్నారు.

## ఈజీఎస్ పనులను పర్యవేక్షించిన అధికారులు

మంథనిరూరల్, మార్చి 5: మండలంలోని ఎక్లాస్‌పూర్, కాకర్లపల్లి గ్రామాల్లో ఈజీఎస్‌లో భాగంగా పనులను పర్యవేక్షించడం కోసంజిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ అసిస్టెంట్‌ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణలు మంగళవారం పర్యవేక్షించారు. బట్వానికుంటలో జరిగే పూడికతీత, ఎస్సారెస్పీ కాలువలో జంగల్ క్లియరెన్స్, పూడికతీత పనులను పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్, జీపీ ప్రత్యేక అధికారులు శరత్, రవి పంచాయతీ కార్యదర్శిలు రాకేష్, అరుణ్ కుమారులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో రూ.4కోట్లతో పండ్ల మార్కెట్

**- టీయూఎఫ్ఐడీసీ నుంచి నిధులు - బస్టాండ్ సమీపంలో ఏర్పాటు**



మార్కెట్ లేకపోవడంతో రోడ్లపైనే వ్యాపారం చేస్తున్న పండ్ల వ్యాపారులు(ఫైల్)

కోల్‌సిటీ, మార్చి 5: రామగుండం కేంద్రంగా పండ్ల వ్యాపారాన్ని విస్తరించాలనే ఉద్దేశ్యంతో గోదావరిఖని పట్టణంలో నూతనంగా రూ.4కోట్లతో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయనున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో ఈమేరకు స్థలాన్ని కేటాయించారు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలకు అనువుగా రూ.4కోట్లతో సౌకర్యాలను కల్పించనున్నారు. హైదరాబాద్‌లోని గడ్డిఅన్నారం, బోయినపల్లి పండ్ల మార్కెట్ల తరహాలో రామగుండంలో పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తద్వారా గోదావరిఖని కేంద్రంగా మంచిర్యాల, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కాగజ్‌నగర్, మహారాష్ట్రలోని గడ్చిరోలి తదితర ప్రాంతాలకు పండ్లు ఎగుమతి అయ్యే అవకాశం ఉంది. కోల్‌బెల్ట్ ప్రాంతంలోనే సుమారు 10లక్షల జనాభా ఉంది. ఇక్కడ పండ్ల మార్కెట్ ఏర్పాటు చేస్తే స్థానికంగా వ్యాపారాలు పెరిగి మరింతమందికి ఉపాధి కలుగుతుందనే ఆలోచనతో ఉన్నారు. గోదావరిఖనిలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో ప్రతిరోజు లక్షల వ్యాపారం జరుగుతుంది. ఇక్కడి నుంచి సమీపంలోని ఐదు జిల్లాలతో పాటు మహారాష్ట్రకు కూడా కూరగాయల సరఫరా ఉంటుంది. అదే తరహాలో పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని సంకల్పించారు. రామగుండం నగపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ మార్కెట్ నిర్మాణం జరుగనున్నది. ఇందుకు సంబంధించి మరో నెల రోజుల్లో పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

### హైదరాబాద్ తరహాలో మార్కెట్ అభివృద్ధి..

**- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్**

గోదావరిఖనిలో పండ్ల మార్కెట్ ఏర్పాటుచేయడం ద్వారా ఈ ప్రాంతంలో వ్యాపారం మరింత అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు నేషనల్ హైవేల సౌకర్యం ఉంది. తద్వారా రామగుండం కేంద్రంగా పండ్ల మార్కెట్ అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. అధికారులు హైదరాబాద్‌కు వెళ్లి మార్కెట్లు పరిశీలించనున్నారు. ఏడాదిలో అందుబాటులోకి తీసుకువస్తాం.

## లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

**- ఎన్నికల నియమావళిపై అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలి - సీపీ ఎం శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ ఎం శ్రీనివాస్

కోల్‌సిటీ, మార్చి 5: లోక్‌సభ ఎన్నికలు నిస్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ ఎం శ్రీనివాస్ కోరారు. మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ, రవాణాశాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో నియోజకవర్గాల వారీగా సరిహద్దులు, చెక్‌పోస్టులు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు, సాధారణ పోలీస్ స్టేషన్లపై వామపక్ష తీవ్ర వాదుల ప్రభావం, పోలింగ్ స్టేషన్ల భద్రత, మొబైల్ టీములు, ఎస్ఎస్‌టీ టీములు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు గురించి చర్చించారు. పోలింగ్ ముందురోజు, పోలింగ్ తరువాత ఈవీఎంలు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, వివిధశాఖల అధికారులతో సమన్వయంపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అన్ని శాఖల అధికారులు ఎన్నికల సంఘం నియంత్రణలో, వారి పర్యవేక్షణలో నియమావళికి కట్టుబడి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశంపై అధికారులు సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని, ఒకటికి రెండుసార్లు ఈ విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని తీవ్ర ప్రభావిత పోలింగ్ స్టేషన్లను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేయాలని, పోలీస్ అధికారులకు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఐలు, ఎస్ఐలు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను సందర్శించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి తీసుకెళ్లే రూట్లను తనిఖీ చేసుకోవాలని, అత్యవసరం ఉన్న, పోలింగ్ స్టేషన్లు ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాటుసారా, గంజాయి, మద్యం నిల్వలపై దృష్టి పెట్టాలని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించే వారు, పాత నేరస్థులు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్, హిస్టరీ షీట్లు ఉన్న వారిని గురించి బైండోవర్ చేయాలన్నారు. సోషల్ మీడియా రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్ పోస్టుల వద్ద సిబ్బంది ఎప్పుడూ అలర్ట్‌గా ఉండేలా చూడాలని, చెక్‌పోస్టులను అధికారులు రోజూ తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు చేతన, అశోక్‌కుమార్, ఏసీపీలు ఎం రమేష్, జీ కృష్ణ, ఆర్ ప్రకాష్ వెంకటేశ్వర్లు, రవికుమార్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మంచిర్యాల ఆర్డీవో వీ రమేష్, మంథని ఆర్డీవో హనుమాన్‌నాయక్, రామగుండం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ టీ రాయలింగు, మంచిర్యాల ఎస్‌పీసీ పీ చంద్రకళ, పెద్దపల్లి ఆర్టీవో రంగారావు, మంచిర్యాల డీటీవో సంతోష్‌కుమార్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### 'నోబెల్'లో ఫేర్‌వెల్ డే




నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 5 : జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్‌లో మంగళవారం పెద్దకల్వల నోబెల్ స్కూల్ ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు గిన్నిస్ బుక్ రికార్డు హోల్డర్ కిషన్ పలు విన్యాసాలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మోహన్, ప్రధానోపాధ్యాయులు ప్రణీత, ఉపాధ్యాయులు గోపి, రాధికలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

జమ్మికుంట, మార్చి 5: జమ్మికుంట రైల్వే స్టేషన్లో ఓ వృద్ధుడు (65) పట్టాలు దాటుతుండగా అయోధ్య స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తిం పు కార్డులు లభించలేదు. మృతుడు తెలుపు రంగు ఫుల్‌షర్ట్, దానిపై నలుపు లైట్‌బ్రౌన్ రంగు నిలువు గీతల డిజైన్, నీలి రంగు గీతల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చు రీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

## రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కె ట్‌కు 71మంది రైతులు 687క్వింటాళ్ల విడిపత్తి, ఐదుగురు రైతులు క్వింటా ళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహి రంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

## దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు

సిరిసిల్ల క్రైం, మార్చి 5: దొంగతనం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు 200 రూపాయల జరిమానా విధిస్తూ ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ సృజన మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట్ మండలం సింగారం గ్రామానికి చెందిన ఘనగోని బంటి షాప్‌లో సెప్టెంబర్ 2, 2023న రాత్రి 10 గంటల సమయంలో దొంగతనం జరిగింది. షాప్‌లో క్యాష్ కౌంటర్‌ను ఓపెన్ చేసి అందులో ఉన్న రూ. 3,500 దొంగతనం చేసారని బాధితులు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నేరస్తుడిని పట్టుకొని కోర్టుకి తరలించారు. కోర్టులో నేరస్థుడు అయిన రామేండ్ల సుధీర్ దొంగతనం చేసానని ఒప్పుకున్నందున న్యాయమూర్తి ఒక ఏడాది సంవత్సరం జైలు శిక్ష , రూ.3,500 జరిమానా విధించినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య


విద్యశ్రీ (ఫైల్)

చందుర్తి, మార్చి 5: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి అనుబంధ గ్రామమైన గొస్కులపల్లికి చెందిన ముదాం విద్యశ్రీ హైదరాబాద్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గొస్కులపల్లి గ్రామానికి చెందిన విద్యశ్రీ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పని చేస్తోంది. ఆరు నెలల క్రితం వరకు వర్క్ ఫ్రం హోం విధులు నిర్వహించింది. అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ విధులకు హాజరవుతోంది. వేములవాడ చెందిన ఓ యువకుడితో ఈ నెల 17న వివాహం జరగాల్సి ఉంది. సోమవారం మధ్యాహ్నం హాస్టల్‌లోని బాత్‌రూంలో ఉరేసుకుంది. గమనించిన హాస్టల్ యాజమాన్యం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

### జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

వీణవంక, మార్చి5: వేతనాలు చెల్లించాలని మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందించారు. వేతనాలు సరైన సమయానికి రాకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోందన్నారు. వేసవి దృష్ట్యా సమయాన్ని కుదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు కండే సదయ్య, కిషన్‌రావు, దాసారపు వెంకటేశ్, మహంకాళి కొంరయ్య, శంకర్, మల్లయ్య, లక్ష్మి, నిజాముద్దీన్, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడలో మహాశివరాత్రికి ఏర్పాట్లు


వేములవాడలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ టౌన్, మార్చి 5: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రాజన్న క్షేత్రం ముస్తాబైంది. రాజన్న ఆలయంలో మూడు రోజులపాటు మహాశివరాత్రి జాతరను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రంగా ఏర్పట్లు సిద్ధం చేస్తుంది. మహాశివరాత్రి జాతరకు సుమారుగా నాలుగు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం వున్నట్లు అధికారులు అంచానా వేస్తున్నారు. వేములవాడ ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పట్టణాన్ని సర్వంగ సుందరంగా సిద్ధం చేశారు. వేములవాడలోకి ప్రవేశించే మార్గాలను కమాన్‌ల వద్ద స్వాగత తోరణాలను భక్తులకు స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. నందికమాన్ చౌరస్తాతో పాటు మూలవాగు బ్రిడ్జిపై రంగురంగుల విద్యుత్ దీపాలతో భక్తులను మంత్రముగ్దులు చేసేలా ఏర్పాట్లను చేశారు. రాజన్న ఆలయం విద్యుత్‌దీపాలతో వెలుగులు జిమ్ముతుంది. ఆలయ గర్భగుడి, మహామండపంతో పాటు ఆలయంలోకి ప్రవేశించి మార్గాల్లో రంగు రంగు పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

### ఇతర రాష్ట్రాల నుంచి రానున్న భక్తులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర ప్రాంతాల వారు ఎక్కువ సంఖ్యలో రానున్నట్లు తెలుస్తుంది. దేవాలయానికి వచ్చే భక్తులు జాగం ముట్టించి మొక్కులు అప్పగించేందుకు వీలుగా భక్తులకు ఇబ్బందులు తలేత్తకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఈవో కృష్ణప్రసాద్‌లు ఎప్పటికప్పుడు ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. దేవాలయ పరిసరాల్లో 850 సీసీ కెమెరాలను, కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సెంటర్‌కు అనుసందానం చేసి 24 గంటలు పోలీసుల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు చేపట్టారు. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసర సేవలు అందిచేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతర జరిగే ప్రాంతాల్లో, బస్టాండు సమీపంలో వైద్యకేంద్రాలను ఏర్పాటు చేసి 104, 108 వాహనాలను ఆలయ పరిసరాల్లో అందుబాటులో చర్యలు చేపట్టారు.

### రాజన్న హుండీ ఆదాయం ఒక కోటి 14 లక్షలు

వేములవాడ టౌన్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఆలయ అధికారులు, సిబ్బంది కలిసి హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. ఒక కోటి 14 లక్షల 2 వేయిల 466 నగదు సమకూరగా 124 గ్రాముల 500 మిల్లి గ్రాముల బంగారం, 7 కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపును ఈవో కృష్ణప్రసాద్, కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఏసి చంద్రశేఖర్, పర్యవేక్షకులు ఏఈవో హరికిషన్, జయకుమారి, ప్రతాప నవీన్ తదితరులు పర్యవేక్షించారు.

## విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి5 : విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహిస్తున్న అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నాతనియల్ తెలిపారు. విద్యార్థులకు 20 లక్షల రూపాయల స్కాలర్‌షిప్ అందించుటకు నిర్ణయించారన్నారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్‌కొరియా, న్యూజిలాండ్ విశ్వ విద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సుల్లో చదివేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు కరీంనగర్ జిల్లాకు చెందిన ఎస్సీ కులమునకు చెందినవారై ఉండాలన్నారు. సంవత్సర ఆదాయం 5 లక్షలకు మించకుండా ఉండాలన్నారు. గ్రాడ్యుయేషన్‌లో 60శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలన్నారు. వీసా అర్హత కలిగి, విదేశీ విశ్వ విద్యాలయము నందు అడ్మిషన్ పొంది ఉండాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి తెలిపారు.

### గ్రూప్స్ ఉచిత శిక్షణ దరఖాస్తులకు తుది గడువు నేడు

గణేశ్‌నగర్, మార్చి 3: కరీంనగర్‌లోని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్‌లో (అంబేడ్కర్ స్టడీ సర్కిల్) గ్రూప్ 1,2,3,4, బ్యాంకింగ్, రైల్వే, స్టాఫ్ సెలక్షన్, ఇతర పోటీ పరీక్షలకు 5 నెలల ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుకు బుధవారం తుది గడువని ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా డైరెక్టర్ బండ శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న కరీంనగర్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికైన 100 మందికి ఉచిత భోజన, వసతులతో పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తారు.

### 8న ఎమ్మార్పీఎస్ సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 5: ఎమ్మార్పీఎస్ కరీంనగర్ నియోజకవర్గ సదస్సును ఈ నెల 8న నిర్వహిస్తున్నామని, ఈ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనీల్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని కార్ఖానగడ్డలో ఎమ్మార్పీఎస్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా కొమ్ముల రమేశ్, ప్రధాన కార్యదర్శి దండు రమేశ్, ఉపాధ్యక్షుడిగా గాలి అరుణ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి దండు అంజయ్య, కనకం అంజిబాబు, నీర్ల కుమారస్వామి, మా రంపెల్లి మల్లేశం, గసికంటి వెంకన్న, చిలుక శ్రీనివాస్, విజయకుమార్, కొమ్ముల సాయికృష్ణ, కొమ్ముల రాజమల్లు పాల్గొన్నారు.

### గంజాయి విక్రయిస్తున్న యువకుడి రిమాండ్

రుద్రంగి మార్చి 5: రుద్రంగి మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన జమీర్ అనే యువకుడు ఎల్లమ్మ ఆలయ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి వద్ద400గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

### విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 5: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి జైలు శిక్ష లేదా జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించిందని ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ శ్రీలక్ష్మి తెలిపారు. జమ్మికుంట మండలం నాగారం గ్రామానికి చెందిన కవ్వంపల్లి రవి, వావిలాల గ్రామానికి చెందిన ఉర సంపత్‌లకు 9,597 రూపాయలు, 5,914 రూపాయల వంతున జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

### విశ్వకర్మ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, మార్చి 5: విశ్వకర్మ ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివపురి రాజేశం కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విశ్వకర్మల పాత్ర కీలకమన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశ్వకర్మల బతుకులు బాగుపడతాయని ఆశించి భంగపడ్డామన్నారు. తమ సమస్యలు తెలుపుదామంటే వినే నాయకుడే కరువయ్యాడని వాపోయారు. తమ వృత్తులకు ఆటంకం కలిగించే విధంగా అటవీశాఖ తీసుకువచ్చిన జీవోతో తమను కేసీఆర్ రోడ్డుపాలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి బీసీ కులగణన చేస్తామని తీర్మానం ఆమోదించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విశ్వకర్మల పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 7న నగరంలోని ఇందిరా గార్డెన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని విశ్వకర్మలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నపుడే తమకు అనేక సంక్షేమ అందాయన్నారు. 2008లో వైఎస్ఆర్ ఉన్నపుడు జీవో 85 ద్వారా ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఫెడరేషన్ ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాలచారి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గర్రెపల్లి నారాయణ స్వామి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చింతల రాజేశ్వర్, పూసాల నారాయణస్వామి, ఊకంటి ఓంకార్, చెల్పూరి జయ, జిల్లా మహిళ అధ్యక్షురాలు పోలోజు అంజలిదేవి, సావనపల్లి లక్ష్మి, పోలోజు లక్ష్మి, పోలోజు అంజమ్మ, పోలోజు విక్రమ్, గర్రపల్లి రాజేశం పాల్గొన్నారు.

## ధర్మపురిలో బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

ధర్మపురి, మార్చి 5: ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. స్థానిక టీటీడీ ధర్మశాల ఆవరణలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బ్రహ్మోత్సవాల సమన్వయ సమావేశానికి డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జగిత్యాల డీఎస్పీ రఘునందన్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్యమ్మ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టాల్సిన వసతుల ఏర్పాట్ల గురించి చర్చించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరు కానున్న దృష్ట్యా ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవాభావంతో పనిచేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం అదనంగా కార్మికులను నియమించి ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి క్షేత్రంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాల సందర్భంగా అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రయాణికుల సంఖ్యను బట్టి అదనంగా ఆర్టీసీ బస్సులు నడిపిం చాలన్నారు. గోదావరి నది, దేవాలయం, బస్‌స్టేషన్, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాన్స్‌కో డీఈఈ రాజరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మురళి, మిష న్ భగీరథ డిఈఈ రాహుల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఈఈ నరసింహమూర్తిని వారి వారి విధులు సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ డీఎం సుమతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమి షనర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, సీఐ రాంనర్సిం హరెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఆర్యవైశ్య సంఘం నేత జక్కు రవీందర్ అధికారులు పాల్గొన్నారు.

## అనుమతి లేని ఇల్లు కూల్చేందుకు అధికారుల యత్నం

● అడ్డుకున్న కుటుంబ సభ్యులు


అయిలయ్య ఇంటి వద్ద అధికారులు, పోలీసులు

శంకరపట్నం, మార్చి 5: గ్రామపంచాయతీ అనుమతి లేదని ఇంటిని కూల్చేందుకు అధికారులు సిబ్బందితో కలిసి రాగా కుటుంబీకులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. కరీంపేట గ్రామానికి చెందిన అంకతి రాజయ్య కుటుంబ సభ్యులు రేకుల షెడ్డు నిర్మించుకున్నారు. ఆ ఇంటిలో రాజయ్య మేన అల్లుడు వనపర్తి అయిలయ్య కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. డీపీవో ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ మంగళవారం ఇంటి నిర్మాణం తొలగించుటకు అక్కడికి వెళ్లారు. ఇంటిలో నివాసం ఉన్న అయిలయ్య కుటుంబ సభ్యులు, వారి బంధు వులు ఆందోళనకు దిగారు. ఆత్మహత్య చేసుకుంటానని అయిలయ్య మందు డబ్బాతో బెదిరించాడు. అధికారులు నాలుగు రోజుల గడువు ఇచ్చి వెనుదిరిగారు.

## భార్యను హత్య చేసిన వ్యక్తి అరెస్టు


పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ క్రిష్ణ

పాలకుర్తి, మార్చి 5 : బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ గ్రామంలో సోమవారం భార్యను హత్య చేసిన కొమురయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ తెలిపారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. రంగాపూర్ గ్రామానికి చెందిన కలవేన కొమురయ్య అనే సింగరేణి ఉద్యోగి తన భార్య కౌసల్య(43)ను గొడ్డలితో నరికి హత్య చేశాడన్నారు. కొమురయ్యను అరెస్టు చేయటంతో పాటు హత్యకు ఉపయోగించి గొడ్డలిని, మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొమురయ్య, కౌసల్య మధ్య కొంత కాలంగా మనస్పర్థలు వచ్చి గొడవలు జరుగుతున్నాయని, కొమురయ్యకు రంగాపూర్‌లో వివాహేతర సంబంధం ఉన్నదని మృతురాలికి అనుమానం ఉండేదని,ఆ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవన్నారు. గోదావరిఖనిలో ఉద్యోగం చేస్తున్న కొమురయ్య రంగాపూర్‌లో వ్యవసాయం చేస్తున్నాడని, కొమురయ్య రంగాపూర్‌లోనే ఉందామని అనగా మృతురాలు ఒప్పుకోలేదని, దీంతో భార్యను తప్పిస్తే తాను ప్రశాంతంగా ఉండొచ్చనే ఆలోచనతో గోదావరిఖని నుంచి ఇంటి సామానును తీసుకరావడానికి వెళ్లగా అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరిగిందన్నారు. అప్పటినుంచి కక్ష పెంచుకున్న కొమురయ్య సోమవారం మధ్యాహ్నం నిద్రిస్తున్న కౌసల్యను గొడ్డలితో నరికి చంపాడన్నారు. గొడ్డలిని గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్‌లో పడేసి తన ద్విచక్ర వాహనంపై వెళ్లి రాత్రి అక్కడే ఉండి మంగళవారం గోదావరిఖనికి వెళ్తుండగా అందుగులపల్లి గ్రామ శివారులో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని 24 గంటలలోపు అరెస్టు చేసినందుకు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామిని, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ఈ పాత్రికేయుల సమావేశంలో పెద్దపల్లి సీఐ ఆర్ క్రిష్ణ, ఎస్ఐలు ఆర్ స్వామి, శివాణిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ లోన్ పేరుతో మోసం

● మెట్‌పల్లిలో యువకుడికి ఇబ్బందులు

మెట్‌పల్లి, మార్చి 5: మెట్‌పల్లి పట్టణానికి చెందిన రాంపల్లి శ్యామ్‌కుమార్ అనే ఓ ప్రైవేటు ఉద్యోగి లోన్ యాప్‌తో మోసపోయాడు. విషయం తెలియడంతో మంగళవాం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపల్లి శ్యామ్‌కుమార్ ఫిబ్రవరి 15న హైదరాబాద్‌లోని కొత్తపేట పెట్రోల్ బంకు సమీపంలోని ఎస్‌బీఐ లోగోతో ఉన్న క్రెడిట్ కార్యాలయంలోకి వెళ్లాడు. క్రెడిట్ కార్డు కావాలని అక్కడ ఉన్న వారిని అడగా ఆయన సిబిల్ స్కోర్ పరిశీలించి నీకు రాదని తెలిపారు. నీకు కావాలంటే క్రెడిట్ బీ అనే లోన్ యాప్ ద్వారా తీసుకుంటే సిబిల్ స్కోర్ పెరుగుతుందని యాప్ డౌన్‌లోడ్ చేశారు. అన్‌లైన్ ద్వారా రూ. 3వేలు అకౌంట్‌కు జమ చేయించారు. అనంతరం దానిని తిరిగి చెల్లించాడు. మళ్లీ ఈ నెల 3న మార్ఫింగ్ చేసిన ఫొటోలు ఆయన వాట్సాప్‌కు వివిధ ఫోన్ నంబర్ల ద్వారా పంపుతూ భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో భయపడి వారు తెలిపిన యూపీఐడీ నంబర్లకు మొత్తం రూ. 32వేలు పంపించాడు. అంతే కాకుండా ఆయన ఫోన్ ప్రమేయం లేకుండా అటోమేటిక్‌గా మెసేజ్‌లు వెళ్లాయి. దీంతో మోసపోయానని గమనించిన శ్యామ్‌కుమార్ మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

### వివాహిత ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, మార్చి 5: మండలంలోని కేసీఆర్ తండాకు చెందిన గుగ్లావత్ లక్ష్మి(31) అను వివాహిత గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల వేధింపులకు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మిని అదే గ్రామానికి చెందిన గుగ్లవత్ భాస్కర్ కొన్ని రోజుల నుంచి వెంటపడి వేధించాడు. దీంతో లక్ష్మి ఇటీవల పోలీసుస్టేషన్‌లో భాస్కర్‌పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని మనసులో పెట్టుకున్న భాస్కర్ లక్ష్మిపై కోపం పెంచుకున్నాడు. మంగళవారం ఉదయం లక్ష్మి పొలం పనుల కోసం ఇంటి నుంచి బయలు దేరింది. మార్గ మధ్యలో భాస్కర్, గుగ్లవత్ సురేష్, గుగ్లవత్ వసంత అను ముగ్గురు తిడుతూ ఆమెపై చేయి చేసుకున్నారు. మనస్థాపానికి గురైన లక్ష్మి ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని ఇంట్లో ఉన్న అత్తమామలకు తెలిపింది. కాసేపటికి ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సమయం తరువాత కుటుంబ సభ్యులు చూసి భర్తకు సమచారం అందించగా ఇంటికి వచ్చి చూసేసరికి చనిపోయింది. మృతురాలి భర్త గుగ్లవత్ మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శికి నాలుగేళ్లలో తొమ్మిది ఉద్యోగాలు


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ

ఇల్లంతకుంట, మార్చి 5: మండలంలోని కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్ ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో గురుకుల పాఠశాల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. నాలుగేళ్లలో తొమ్మిది ఉద్యోగాలు సాధించి సత్తా చాటిన సందర్భంగా మంగళవారం శ్రీనివాస్‌ను సన్మానించారు. మెదక్ జిల్లా హవేలిఘన్పూర్ మండలం పరీద్‌పూర్ తండాకు చెందిన శ్రీనివాస్ ఇప్పటి వరకు ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్, కో ఆపరేటీవ్‌లో అసిస్టెంట్ మేనేజర్, పంచాయతీ కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్‌సప్లైలో జూనియర్ అసిస్టెంట్, ఎఫ్‌సీఐలో జూనియర్ అసిస్టెంట్, బీఎస్ఎన్ఎల్‌లో జేఏవో, మున్సిపాలటీలో సీనియర్ అకౌంటెంట్, గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు పొందాడు. ప్రజలకు సేవచేయాలనే లక్ష్యంతో ఇంతకాలం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి పంచాయతీ కార్యదర్శిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాస తిరుపతి, ఎలుక స్వామి, అల్లెపు రజనీకాంత్, మామిడి రాజు, బిగుల్ల విజయ్, న్యాత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ నేత కన్నుమూత

ఎలిగేడు, మార్చి 5 : పేద, బీద వర్గాల కోసం జీవితాంతం పోరాటంచేసిన సీపీఐ నేత బుర్ర కొండయ్య గౌడ్(86) మంగళవారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని స్వగృహంలో కన్నుమూశారు. బుర్ర కొండయ్య చిన్న నాటి నుంచి సీపీఐ పార్టీ కార్యకర్తగా పనిచేసి జిల్లా, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. కొండయ్య గౌడ్ పార్థివదేహంపై ఎర్ర జెండా కప్పి పలువురు నాయకులు నివాళులర్పించారు. తాళ్లపల్లి లక్ష్మణ్, బోయిని అశోక్, జాగిరి సత్యనారాయణ గౌడ్, పైడిపల్లి రాజు గౌడ్, చంద్రమౌళి, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రామభక్తులకు సన్మానం

య్లైటింక్లయిన్‌కాలనీ, మార్చి 5: ఇటీవల అయోధ్య పర్యటన ముగించుకుని వచ్చిన రామభక్తులకు మంగళవారం విశ్వహిందూ పరిషత్ పట్టణ కమిటీ పోతనకాలనీలో సన్మానించింది. దావ రాజిరెడ్డి, బాలయ్య, ఆకుల శశికుమార్, దశరథంగౌడ్, తిరుపతి, రవీందర్, రాంకోటి, ఆకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సదస్సును విజయవంతం చేయాలి

జ్యోతినగర్, మార్చి 5 : అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహిస్తున్న మహిళా సదస్సును విజయవంతం చేయాలని పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి కోరారు. ఈ మేరకు మంగళవారం ఎన్టీపీసీ మహిళా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు రాయమల్లమ్మ, లక్ష్మి, పద్మ, శివరంజని, ప్రమీల పాల్గొన్నారు.

# నరకప్రాయంగా చిన్నకొమిర-మల్యాల రోడ్డు

**- మరమ్మతులకు నోచుకోని వైనం - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు - ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**


పాడైపోయిన బీటీ రోడ్డు


దెబ్బతిన్న కల్వర్టు

ఓదెల, మార్చి 5 : మండలంలోని చిన్నకొమిర, భీమరపల్లి, నుంచి వయా జగ్గయ్యపల్లి, మల్యాల వరకు నిర్మించిన బీటీ రోడ్డు, కల్వర్టు దెబ్బతిన్నాయి. 2018లో ప్రారంభమై 2019లో పూర్తయిన ఆరుకిలో మీటర్ల ఈ రోడ్డు నిర్మాణానికి అప్పట్లో పంచాయతీ రాజ్ నుంచి రూ.4 కోట్లు ఖర్చు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడంతో ఈ రోడ్డు దెబ్బతిని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. నిత్యం ఈ రోడ్డు ద్వారా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి, మిర్జంపేట్, కిష్టంపేట్ మీదుగా సింగరేణి కార్మికులు సైతం భూపాలపల్లికి, అలాగే జాతర సమయంలో మేడారంనకు వెళ్తారు. ఓదెల రైల్వే అండర్ బ్రిడ్జిలో నీటి నిలువ ఉన్న సమయంలో మల్యాల, గూడెం మీదుగా గుంపుల నుంచి జమ్మికుంటకు నిత్యం వెళుతున్నారు. దీంతో 20 నుంచి 25 కిలోమీటర్ల దూరభారం తగ్గడమే కాకుండా సమయం ఆదా అవుతుంది. ప్రస్తుతం ఈ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులకు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణానికి మోక్షమెప్పుడో?

**- నిధులు కేటాయించినా భూ వివాదంతో ముందుకు సాగని పనులు - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**

పెద్దపల్లిటౌన్, మార్చి 5 : జిల్లాలోని దళిత విద్యార్థులు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం కోసం 5 కోట్ల రూపాయల నిధులు కేటాయించారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు 2017లో శంకుస్థాపన చేశారు. పట్టణంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న సర్వే నంబర్ 708లో 60 గుంట స్థలం ఉంది. అందులో అయితే 60 గుంటల స్థలంలో కముటం లక్ష్మి పేరు మీద 24 గుంటలు, మిగతా 36 గుంటలు దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్నట్లు తేలింది. అయితే భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం దేవాదాయ శాఖ ఆధీనంలో ఉండడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇటీవల కాలంలో ప్రభుత్వం విడతల వారీగా ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేస్తుండడంతో దళిత విద్యార్థులు, నిరుద్యోగులు ఆందోళన గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించాలని దళిత సంఘాలు, విద్యార్థులు కోరుతునారు.


అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం భవనానికి కేటాయించిన స్థలం

## కొప్పుల పేరు ప్రకటించడంపై సంబరాలు

ధర్మారం, మార్చి 5: బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరును అధిష్టానం ఖరారు చేయడం పట్ల మంగళవారం ధర్మారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. ప్రధాన చౌరస్తాలో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. మండల శాఖ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, మండల నాయకులు పూస్కూరి జితెందర్‌రావు, రామారావు, పాకాల రాజయ్య, తుమ్మల రాంబాబు, ఆవుల లత తదిరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగు విధానాలపై అవగాహన..

కమాన్‌పూర్, మార్చి 5 : రైతులకు సాగు రంగంలో నూతన విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రైతు వేదికల్లో దృశ్య శ్రవణ విధాన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 6న ప్రారంభిస్తున్నారని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు. గుండారం గ్రామంలోని రైతు వేదికలో దృశ్య శ్రవణ విధానం ద్వారా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు, ఈ కార్యక్రమానికి రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## ఫొటోగ్రాఫర్ సతీష్‌కు నివాళి

కోల్‌సిటీటౌన్, మార్చి 5: ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ గాలి సతీష్‌కు ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ గౌరవ అధ్యక్షులు సోమారపు అరుణ్ కుమార్ నివాళులు అర్పించారు. మంగళవారం సతీష్ స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను కలిసి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి

ఎలిగేడు, మార్చి 5 : హైదారాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 12న జరిగే తెలంగాణ ఉద్యమకారుల కృతజ్ఞత సభకు విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు బింగిరాజు అన్నారు. వెంట ఉద్యమకారులు యాసాల శ్రీనివాస్, లక్ష్మన్, రవి, మద్దెల సంపత్, సంజీవ్, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

## 'ప్రజల హృదయాల్లో నిలిచిన నేత బిరుదు'

సుల్తానాబాద్, మార్చి 5: పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచి ఉండే నేత మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు అంటూ ప్రజాప్రతినిదులు కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీవాణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బిరుదు రాజమల్లుకు సంబంధించిన పాటల సీడీని ఆవిష్కరించారు. పెద్దపల్లి మాజీ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, సుల్తానాబాద్ జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాశ్‌రావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సాయిరి మహేందర్, కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య, బిరుదు రాజమల్లు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేలాల, కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు

కళ్యాణ్‌నగర్, మార్చి 5: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరిఖని ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో వేలాల, కాళేశ్వరంకు గోదావరిఖని నుంచి ప్రత్యేక బస్సు సర్వీలు నడపనున్నట్లు డిపో మేనేజర్ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 7, 8, 9 తేదీల్లో కాళేశ్వరంకు గోదావరిఖని బస్టాండ్ నుంచి ఉదయం 5.30, 6.30, 7.30, 11.30, మధ్యాహ్నం 12.30, 1.30గంటలకు ప్రత్యేక సర్వీసులు ఉంటాయన్నారు. అలాగే మార్చి 7, 8, 9 తేదీల్లో వేలాలకు 20 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.40 చార్జీలు వసూలు చేస్తామని, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు.

## జీవోను గెజిట్‌గా చేయాలి

య్లైటింక్లయిన్‌కాలనీ, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం 22వ జీవోను గెజిట్ చేసి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బీ అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ-2 ఏరియాలోని సివిక్ జోన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ ఎస్ హయాంలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచలేదని, ఇతర సమస్యలను పట్టించుకోలేదన్నారు. జీఓ 22 విడుదల చేసినా గెజిట్ చేయని కారణంగా సింగరేణి కార్మికులకు వర్తించడంలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ చేయాలని కోరారు. న్యాయమైన వేతనాలు ఇవ్వాలని, చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని అశోక్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీ లక్ష్మి, సమ్మయ్య, కవిత, జలపతి నాయక్, బుచ్చమ్మ పాల్గొన్నారు.

## అప్పు తిరిగి ఇప్పించాలని మహిళల నిరసన

కోల్‌సిటీ, మార్చి 5: తన వద్ద రూ.7లక్షల అప్పు తీసుకుని తిరిగి ఇవ్వమంటే శ్రావణ్‌గౌడ్ అనే వ్యక్తి బెదిరిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ సూఫి ఇస్లామిక్ బోర్డు నిర్వాహకురాలు షిరీన్ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో బాధితురాలు తీగల మల్లీశ్వరితో పాటు మహిళలు నిరసన తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు బాధితురాలితో మాట్లాడి ఆందోళన విరమించాలని కోరారు. తమకు న్యాయం జరిగితేనే ఆందోళన విరమిస్తామని మహిళలు పేర్కొన్నారు.

## 'రాజకీయాల్లో గెలుపోటములు సహజం'

గోదావరిఖని, మార్చి 5: రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నివాసంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్‌రావు, పెంట రాజేష్, కుమ్మరి శ్రీనివాస్, రమణారెడ్డి, కృష్ణవేణి, వంగ శ్రీనివాస్, తస్లీమ్‌భాను, రఫిక్, బొడ్డు రవీందర్, రాకం వేణు, జేవీ రాజు, కాల్వ శ్రీనివాస్, ముదాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బెల్ట్‌షాపులను వెంటనే మూసివేయించాలి : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, మార్చి 5: జిల్లాలో ఉన్న బెల్ట్‌షాపులపై కఠినంగా వ్యవహ రించాలని, ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వెంటనే మూసివేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ బెల్ట్‌షాపులు మూసివేతపై సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని, షాపుల నిర్వాహకులపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసులు బుక్ చేయాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వం అనుమతించిన వైన్ షాపులు, బార్‌లలో మాత్రమే మద్యం విక్రయాలు జరగాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఎక్కడ బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జరగవద్దని, ప్రతి వైన్‌షాప్‌నకు కేటాయించే మద్యం స్టాక్ వివరాలు నిరంతరం పరిశీలించాలన్నారు. బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, ఎక్సైజ్ సీఐలు పెద్దపల్లి శిరీష, రామగుండం మంగమ్మ, సుల్తానాబాద్ గురునాథ్, మంథని రాకేష్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.


ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

## విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి : డీఈవో


సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డీఈవో మాధవి

ధర్మారం, మార్చి 5: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఎగ్జిబిషన్‌ల ప్రదర్శన చేయడం కీలమని డీఈవో మాధవి అన్నారు. మంగళవారం ధర్మారంలోని సాయిమణికంఠ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్ట్‌ల్లో ప్రతి అంశపై చక్కగా బోధించాలని ఆమె చెప్పారు. బోధన, అభ్యాసం యొక్క ప్రభావాన్ని మెరుగుపరచడానికి సృజన్మాతకతను ఉపయోగించాలని ఆమె సూచించారు. కొత్త కొత్త అంశాలను విద్యార్థులు అన్వేషించి ఎంతో ఉపయోగపడే విధంగా ప్రదర్శించడం చాలా అభినందనీయమని ఆమె అన్నారు. ప్రతి అంశంలో సృజనాత్మకత పాత్ర ఎంతో అవసరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏ రజిత జడ్పీటీసీ సభ్యురాలు పూస్కూరి పద్మజ, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి, కరస్పాండెంట్ జైన సురేష్‌కుమార్, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు. కాగా, సైన్స్ ఎగ్జిబిషన్‌లోని నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

## బీఆర్ఎస్‌కు మరో ఇద్దరు కార్పొరేటర్ల రాజీనామా

కోల్‌సిటీ, మార్చి 5: బీఆర్ఎస్ పార్టీకి రామగుండంకు చెందిన మరో ఇద్దరు కార్పొరేటర్లు రాజీనామా చేశారు. 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత, 41వ డివిజన్ కార్పొరేటర్ గాదం విజయ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తాము వ్యక్తిగత కారణాలతో బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు.

## క్రికెట్ పోటీలకు ఆహ్వానం

కమాన్‌పూర్, మార్చి 5 : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఈనెల 7, 8వ తేదీల్లో స్పెషల్ నైట్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నటు హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు నాంగోని సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథని నియోజకవర్గ పరిధిలో 7మందికి ఒక జట్టు చొప్పున ఎంట్రీ ఫీజు రూ.500లతో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగలవారు ఆర్గనైజర్స్ మిడిపెల్లి రఘు, మెడగొని సాయి, కొప్పుల సాయి, కల్వల రాకేష్‌లను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7815923914, 9603171796, 9908026508 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## గాలికుంటువ్యాధి టీకాలు

ఎలిగేడు, మార్చి 5 : మండలంలోని నారాయనపల్లి, రాములపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరంలో 177 పశువులకు, గేదలకు గాలికుంటు టీకాలను వేసారు. ఆయా గ్రామాల రైతులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**- మంథని సీఐ వెంకటేశ్వర్లు**

మంథని, మార్చి 5: శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా ఎవరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని మంథని సీఐ ఎస్.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఇటీవల మంథని సీఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులో ఇతరులను రెచ్చగొట్టే విధంగా వ్యవహించే వారిపై సైతం ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో ఆయా గ్రూపుల అడ్మిన్స్ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంథనిలో ట్రాఫిక్ కంట్రోల్‌కు స్పెషల్ టీంలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువత మద్యానికి, డ్రగ్స్‌కు బానిస కాకూడదని సూచించారు. వీటిని నియంత్రించడానికి కూడ ప్రత్యేక నిఘా టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈవ్‌టీజింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాలు జరగకుండా రాత్రిపూట పెట్రోలింగ్ పెంచుతామనిన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారి సమాచారం పోలీసుకు ఇవ్వాలని ప్రజలను కోరారు. మంథని ఎస్ఐ వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

**కమాన్‌పూర్** : శాంతిభద్రతలకు పరిరక్షణే ప్రథమ కర్తవ్యమని గోదావరిఖనీ టూటౌన్ సీఐ రవీందర్ అన్నారు. మంగళవారం మండల కంప్రేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ మోసాలు, అసాంఘీక కార్యకలాపాల నియంత్రణకు అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల నుంచి వచ్చే ఫిర్యాదారులతో స్నేహపూర్వకంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఆయన వెంట ఎస్ఐ మామిడాల చంద్రశేఖర్, ఏఎస్ఐ బాలాజి నాయక్, హెడ్ కానిస్టేబుల్స్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# అలంకారప్రాయంగా డ్రైనేజీలు

**- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న మురుగు నీరు - పట్టించుకోని అధికారులు**



డ్రైనేజీలో నిలిచిన మురుగు నీరు, పెరిగిన పిచ్చిమొక్కలు

ధర్మారం, మార్చి 5: ధర్మారం మండల కేంద్రంలో నిర్మించిన డ్రైనేజీలో మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. నూతనంగా డ్రైనేజీలను నిర్మించినప్పటికీ అలంకారప్రాయంగా మారాయి. మండల కేంద్రంలో గల ప్రధాన చౌరస్తా నుంచి సాయిమణికంఠ పాఠశాల వరకు ఇరువైపులా డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణాలకు గత ప్రభుత్వ హయాంలో రూ.3కోట్ల 50లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధుతో ధర్మారం-పెద్దపల్లి రహదారిలో ధర్మారంలో ఇరువైపుల కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా డ్రైనేజీలను నిర్మించడం వల్ల ఎక్కడి మురుగు నీరు అక్కడే నిలిచిపోతోంది. డ్రైనేజీల నిర్మాణ సమయాల్లో ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ ఇష్టారీతిన నిర్మించారు. దీంతో నిబంధనలను పాటించకుండా నిర్మించిన డ్రైనేజీల్లో మురుగు నీరు నిలిచి తీవ్ర దుర్వాసన వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు ఎటూ ప్రవహించకుండా డ్రైనేజీలోనే నిలిచి ఉంటోంది. డ్రైనేజీల్లో బండరాళ్ల పడి ఉన్నాయి. అంతేకాకుండా పిచ్చి మొక్కలు కూడా పెరిగి ఉన్నాయి. ఈ డ్రైనేజీల గురించి పట్టించుకున్న అధికారే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నేత్ర దానం

కోల్‌సిటీటౌన్, మార్చి 5: గోదావరిఖని విజయనగర్‌కు చెందిన గుండేటి యశోద(61) ఈనెల 2న రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందగా ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ టెక్నీషియన్ ద్వారా నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. నేత్ర దాతకు నివాళులర్పించారు. కార్పొరేటర్ అయిత శివకుమార్, నాయకుడు బొల్లెన శ్రీధర్, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, నూకా రమేష్, సానా రామకృష్ణారెడ్డి, ప్రతినిధులు చంద్రమౌళి, కెఎస్ వాసు, భీష్మాచారి, అన్నపూర్ణ, శశికళ, శారదా, చంద్రశేఖర్, రామన్న, జ్యోతి, లక్ష్మీనారాయణలు యశోద కుటుంబ సభ్యులను అభినందించారు.

## నియామకం

పెద్దపల్లి రూరల్, మార్చి 5: పెద్దపల్లి హాస్పిటల్ మార్కెటింగ్ కమిటీ మండల అధ్యక్షుడిగా గంగుల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చాటకోళ్ల శ్రీకాంత్, జనరల్ సెక్రెటరీగా అడప సంతోష్ కుమార్, కోశాధికారిగా రాపెల్లి రాజ్‌కుమార్, ప్రచార కార్యదర్శి ఈదునూరి సాగర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, సాగర్, ప్రేమ్, శేఖర్, సతీష్, శ్రీధర్, విజయ్, సుధాకర్, సుమంత్, రాకేష్, ప్రసాద్, కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## 'వేతన బకాయిలు చెల్లించాలి'

పెద్దపల్లి రూరల్, మార్చి5: పెద్దపల్లి మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని మంగళవారం ఎంపీవో సుదర్శన్‌కు కార్మికులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఖాజా, మండల కార్యదర్శి జంగపల్లి నరేష్, బందరి అశోక్, నర్సయ్య, సిరిసిల్ల నర్సయ్య, మల్లారపు మల్లేష్, శ్రీను, సందీప్, సంపత్ పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

పెద్దపల్లి కల్చరల్, మార్చి 5: విద్యార్థుల లక్ష్య సాధనకు సైన్స్ దిక్సూచిగా నిలుస్తుందని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ జోనల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వి.కిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటి ఫార్మసీ కళాశాలలో మంగళవారం జరిగిన సైన్స్ డే ప్రత్యేకత అంశంపై జరిగిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఫార్మసీ విద్యార్థులను ఉద్దేశించి పలు అంశాలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రినిటి విద్యాసంస్థల ఛైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, తెలంగాణ అకాడమీ సైన్స్ జోనల్ సెక్రెటరీ ప్రొఫెసర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పౌర హక్కుల సంఘం పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లి కల్చరల్, మార్చి 5: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పౌరహక్కుల సంఘం 50 వసంతాల ముగింపు సభ కరపత్రం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పౌరహక్కుల సంఘం 50 వసంతాల ముగింపు సభలు ఈనెల 9,10 తేదీలలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లిలో జరగనున్నాయని పేర్కొన్నారు. హక్కులు జీవించడానికి అవసరం. జీవితాల్ని మెరుగుపరచుకోవడానికీ అవసరం, హక్కులు పాలకుల భిక్ష కాదన్నారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం సహయ కార్యదర్శి మదన కుమారస్వామి, అధ్యక్షులు శ్రీపతి రాజగోపాల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్ల సుచరిత, నార వినోద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, మార్చి 5: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి క్రింద ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయం కోసం మార్చి31 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి యం.నాగైలేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరానికి గాను అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.https://telanganaepasscbbgov.in ద్వారా మార్చి31 లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

## 'ప్రవీణ్‌కుమార్‌పై ఆరోపణలు నిజం కాదు'

పెద్దపల్లిటౌన్, మార్చి5: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఇరికిల్ల రాజనర్సయ్య స్పష్టం చేశారు. మంగళవారం బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో రాజనర్సయ్య మాట్లాడుతూ ఈ విషయమై ప్రవీణ్ కుమార్ కూడా ట్విట్టర్ వేదికగా వివరణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్వైజర్ పేగ నరేష్, జిల్లా మహిళ కో కన్వీనర్ కె.ఎల్ అనిత బహుజన్, పెద్దపల్లి నియెజకవర్గ అధ్యక్షులు బోంకురి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు గాజుల రమేష్, పెద్దపల్లి టౌన్ అధ్యక్షుడు రామిళ్ళ శారద నాయకులు బోంకురి సాగర్, బోంకురి అన్వేష్, పల్లె ప్రశాంత్, సోహెల్, దోడ్డే విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత

**-జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ**



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అరుణ

పెద్దపల్లి కల్చరల్, మార్చి 5: మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యతగా పని చేయాలని జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. మంగళవారం పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా సాధికారత ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దయా అరుణ మాట్లాడుతూ సాధికారతకు ప్రతి ఒక్క మహిళ తన వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపల్ సీతారెడ్డి, అధ్యాపకులు స్వాతి, గీత, రవి, సంజీవ్ పాల్గొన్నారు.

## జాతర పోస్టర్ ఆవిష్కరణ

ధర్మారం, మార్చి5: ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలో గల సాంబమూర్తి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల జాతర పోస్టర్‌ను మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. మంగళవారం కరీంనగర్‌లోని ఆయన నివాసానికి ఆలయ నిర్వాహకులు వెళ్లి జాతర మహోత్సవానికి హాజరు కావాలని ఆహ్వానపత్రం అందజేశారు. కలసిన వారిలో మాజీ ప్రజాప్రతినిధులు, నిర్వహాకులు పాల్గొన్నారు.

## మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి గడువు పొడిగింపు

సుల్తానాబాద్, మార్చి5: సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2024-2025 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి నుంచి పదవ తరగతిలో చేరడానికి ప్రవేశ గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ఉన్న వంద సీట్లకు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదవ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 7న ఉదయం పది గంటలకు ఉంటుందన్నారు. ఎనిమిది నుంచి పదవ తరగతుల వారికి అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు స్కూల్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎంపీపీ

మంథనిరూరల్, మార్చి 5: మండలం ఆరెంద గ్రామపంచాయతీ పరిధిలో రూ.15 లక్షల సీసీ రోడ్డు పనులను, రచ్చపల్లిలో రూ.8 లక్షల రూపాయలతో నిర్మించే వాటర్ ప్లాంట్ పనులను మంగళవారం ఎంపీపీ కొండ శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మిడి స్వరూప్ రెడ్డి, ఎంపీటీసీ పెండ్లి చైతన్య ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కొమ్మిడి సంతోష్ కుమార్, కొమ్మిడి నరేష్, దిబ్బర కిషన్, మాసిరెడ్డి లక్ష్మారెడ్డి, రాజబాపుగౌడ్, జోడు రాజేష్, అధికారులు పాల్గొన్నారు.